క్లుప్తంగా

పారిజాతగిరిలో పూజలు



జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా విశేష పూజలు చేశారు. సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగ నివేదన తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. భక్తులకు దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో దాత రెడ్డి ప్రసాద్, కుటుంబ సభ్యుల సహకారంతో మజ్జిగ వితరణ చేసినట్టు ఈఓ మానికల రాంబాబు తెలిపారు. వేగవరానికి చెందిన చిట్లూరి శేషశైలేంద్ర కుమార్, నిర్మల దంపతులు సౌజన్యంతో అన్నప్రసాద వితరణ చేశామన్నారు. దాతలను అర్చకులు వేదాశీర్వాదంతో సత్కరించారు. కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతి రాజు, మాదాల రామ్మోహనరావు, దండు ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్ది అంజన్నకు అభిషేకాలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో శనివారం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపం వద్ద అర్చకులు, వేద పండితులు పంచామృతాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం వరకు వివిధ సేవల రూపేలా ఆలయానికి రూ.1,02,230 ఆదాయం సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. బయ్యగూడెం గ్రామానికి చెందిన పారేపల్లి రామారావు దంపతులు స్వామి వారికి 7.296 గ్రాముల బంగారం అందజేసినట్టు చెప్పారు. స్వామి వారి నిత్యాన్నదాన సత్రంలో సుమారు 1100 మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో జువ్వాది కృష్ణ పర్యవేక్షించారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



దాత సత్యనారాయణకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న హయగ్రీవాచార్యులు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఇద్దరు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.2,00,116 విరాళంగా అందజేశారు. చింతలపూడికి చెందిన గూడపాటి వెంకట సత్యనారాయణ రూ. 1,00,116లు, చెన్నైకు చెందిన ఆర్ నాగేంద్ర ప్రసాద్ రూ1,00,000 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటిండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు. దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఆరోగ్య సేవలు నమోదు చేయాలి

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో శనివారం హెల్త్ ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్ సిస్టమ్‌లో నూతనంగా సవరించిన రిపోర్టింగ్ ఫార్మేట్స్‌పై ఆర్‌సీహెచ్, ఎనమోల్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.మురళీధర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల ద్వారా క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవల సమాచారాన్ని హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం, దొరమామిడి, అంతర్వేదిగూడెం, కేఆర్‌పురం, పీహెచ్‌సీల పరిధిలో ఉన్న డాక్టర్‌లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



దొరమామిడిలో బాల్య వివాహాలను అరికట్టాలని ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. బుట్టాగూడెం మండలం దొరమామిడిలో బాల్య వివాహాలను అరికట్టాలని, బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ న్విహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బాలికను వివాహం చేసుకుని సంసారం చేసిన భర్తకు ఫోక్సో చట్టం కింద 10 సంవత్సరాలు జైలు శిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గంటా శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో అవకతవకల గురించి సజ్జలకు వివరించినట్టు శ్రీనివాస్ తెలిపారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకప్రాయం

కామవరపుకోట మండలంలో ప్రజల ఆవేదన



కామవరపుకోట - జీలకరగ్రూడెం రహదారిపై ఏర్పడిన గోతులు



పాతూరు - ముదిరాజుల కాలనీ వరకు రోడ్డుపై లేచిన కంకర

కామవరపుకోట: మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై కంకర రాళ్లు పైకి లేచిపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామవరపుకోట మండలం కళ్లచెరువు, కేఎస్ రామవరం, జలపవారిగూడెం, అంకాలంపాడు మీదుగా కామవరపుకోట వరకు ఉన్న రోడ్డు నిర్మాణ పనులు ఇటీవల చేపట్టారు. ఇది వైఎస్సార్ సీపీ హయాంలో రూ.7.40 కోట్లు కేటాయించి, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. అయితే ఇటీవల వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు కేసరి సరితా రెడ్డి చొరవతో యుద్ధ ప్రాతిపదికిన పనుల ప్రారంభించి, పాతూరు వరకు రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి పాతూరు గ్రామం, తహసీల్దార్ కార్యాలయం మీదుగా ముతురాజుల కాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి కంకర వేశారు. స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఈ రహదారి మొత్తం కంకర రాళ్లు పైకి లేచిపోవడంతో ప్రయాణానికి ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఇటీవల ఈ రోడ్డులో వాహనం అదుపుతప్పి ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. చింతలపూడి నుంచి జీలకరగ్రూడెం, కామవరపుకోట వరకు ఈ రోడ్డులో బస్సు సరీ్వసులు తక్కువ, ఆటో సర్వీసులు ఎక్కువగా ఉంటాయి. ఈ రోడ్డుపై ఏర్పడిన గోతులు కారణంగా ఆటో పాడైపోతున్నాయని డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నారు. జంగారెడ్డిగూడెం, ఏలూరు వయా దేవులపల్లి నుంచి రావికంపాడు, గొల్లగూడెం, నారాయణపురం, ఆడమిల్లి తడికలపూడి వరకు రోడ్డు మరమ్మతుల్లో భాగంగా గోతుల్లో అరకొర కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రయాణం చేసే సమయంలో దుమ్ము, దూళి పైకి లేచి రోడ్డంతా ఆవరిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోడ్డుపై ప్రయణం చేయాలంటేనే ప్రజలు నరకం చూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఆటోలకు మరమ్మతులు



రహదారులపై అడుగడుగునా ఏర్పడిన గుంతల వల్ల ఆటోలు నడపాలంటేనే నరకం చూస్తున్నాం. ఆటోలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. సంపాదించిన దానిలో ఎక్కువ శాతం ఆటోల మరమ్మతులకే ఖర్చవుతుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి.

– ప్రొద్దుటూరు సుందర్రావు, ఆటో డ్రైవర్, కామవరపుకోట

రోడ్ల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి



రోడ్ల మరమ్మతుల పేరుతో అక్కడక్కడ గోతులు తవ్వి, కంకర పోసి వదిలేశారు. దీంతో రోడ్ల గోతులతో పాటు దుమ్ము పైకి లేచి రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్లు మరమ్మతులు చేపట్టాలి. పెద్దపెద్ద ప్రమాదాలు సంభవించక ముందే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– మిదతా రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, కామవరపుకోట

వయో పరిమితి కుదింపుతో అన్యాయం



రెడ్డిగణపవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పొందేందుకు వయో పరిమితి 50 నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 2019లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరయ్యాయన్నారు. వాటిని తీసుకునే సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో నిలిచిపోయాయని చెప్పారు. అయితే అప్పటికే వయస్సు 45 సంవత్సరాలు ఉన్నాయని ఇప్పుడు 51కి పెరిగాయని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వయో పరిమితి తగ్గించడం వల్ల అనేక మందికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. వయో పరిమితి 50 నుంచి 60 సంవత్సరాలకు పెంచి రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

చింతలపూడి : చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి మండలంలో ఉన్న సాగునీటి చెరువులకు గోదావరి జలాలను అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. శనివారం పార్టీ స్థానిక కార్యాలయంలో కంచర్ల గురవయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన పార్టీ చింతలపూడి మండల కౌన్సిల్ సమావేశంలో కృష్ణ చైతన్య ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.40 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, కోర్టు కేసుల్లో ఉన్న భూముల క్లియరెన్స్‌కు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ వేసవిలో ఇరిగేషన్ చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. చెరువుల అభివృద్ధితోపాటు ఆక్రమణలను తొలగించాలని, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు కేటాయించి, కనీస వేతనం రూ.700 ఇవ్వాలని, పెండింగ్ వేతనాలని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తొర్లపాటి బాబు, మామిళ్ళపల్లి వసంతరావు, దొంత కష్ణ, బోడ వజ్రం, ముల్లగిరి నాగేశ్వరరావు, ఎస్కే మస్తాన్, టి.మాణిక్యాలరావు, ఎస్‌కే జానీ, ఎస్కే కాలేషా, తొర్లపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



పంగిడిగూడెంలో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

ద్వారకాతిరుమల: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని, పే స్లిప్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశంలో శనివారం ధర్నా చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేలే వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కూలీలకు 3 నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. చట్టప్రకారం 15 రోజులకు ఒకసారి వేతనం, పే స్లిప్ ఇవ్వాలని, కానీ ఆ చట్టాన్ని అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో టెంట్, మంచి నీరు, మజ్జిగ వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. వ్యవసాయ పనులు లేక అల్లాడుతుంటే, మరోపక్క ఉపాధి పనులు చేసినా వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పని చేస్తున్న ప్రతి కుటుంబానికి 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మానుకొండ వీర్రాజు, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులున్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన



రాజవరంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం

కొయ్యలగూడెం: పొంగుటూరు సెక్టార్ రాజవరం అంగన్‌వాడీ కేంద్రాలు 35, 157లో పోషణ్ పక్వాడా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని సూపరింటెండెంట్ సరస్వతి తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజవరం గ్రామ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య మాట్లాడుతూ గ్రామంలోని గర్భిణులకు పెరుగుదల పర్యవేక్షణ, రెండేళ్లకంటే తక్కువ వయసున్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణను తల్లులకు వివరించారు. గర్భిణులకు బాల సంజీవని కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.లీలాకుమారి, ఎస్ అంజలి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలక్ష్మి, సంధ్య, హరిబాబు, ఏఎన్‌ఎంలు కృష్ణకుమారి, వెంకట కుమారి, మహిళా కార్యదర్శులు స్పందన, వైశాలి, అపురూప, బి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పంగిడిగూడెంలో పోషకాహార పక్షోత్సవాలు



పంగిడిగూడెంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరి మాట్లాడుతూ పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి, వారికి శక్తినిచ్చే ఆహార పదార్థాలను వండే విధానాలను పిల్లల తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ సెంటర్ నుంచి అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు మాత్రమే ఉపయోగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీఎంఎస్‌కే నజీమా మాట్లాడుతూ గ్రామంలో బాల్యవివాహాలను అరికట్టాలని, కాన్పుకి కాన్పుకి మధ్య వ్యవధి ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మౌనిక, శైలజ, అంగన్‌వాడీ టీచర్లు సుమతి, నాగలక్ష్మి, సైలజ, సింధు, నాగలక్ష్మి, హెల్పర్ భారతి, లబ్ధిదారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్

లింగపాలెం: లింగపాలెంలో మన్నా చర్చి ఆధ్వర్యంలో శనివారం సంఘ కాపరి పాస్టర్ కమలాకర్ అధ్యక్షతన ప్రముఖ క్రైస్తవ ఆరాధన టీవీ ఛానల్ పర్యవేక్షణలో సువార్త సమైక్య ర్యాలీ (రన్ ఫర్ జీసస్) నిర్వహించారు. లింగపాలెం ప్రధాన సెంటర్‌ను మండల కార్యాలయం, గొల్లగూడెం, రెడ్డి బజారు, సింగగూడెం, తదితర ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది. పాస్టర్ ఏసుక్రీస్తును గురించి సువార్తను ప్రకటించారు. కార్యక్రమంలో లింగపాలెం మన్నా చర్చి విశ్వాసులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు భూ పట్టాలివ్వాలి

కుక్కునూరు: పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీలకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలివ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కుక్కునూరు మండలం కొత్తూరు గ్రామంలో నిర్వహించిన సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో గౌస్ మాట్లాడారు. ఆదివాసీలు ఫలసాయం కోసం అటవీ ప్రాంతంపై ఆధారపడడం తరతరాలుగా వస్తోందన్నారు. చిన్న, చిన్న వస్తువులు అటవీ ప్రాంతం నుంచి తెచ్చుకుంటుంటే అటవీ శాఖ అధికారులు బెదిరింపులకు పాల్పడుతూ ఆంక్షలు పెట్టి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇకపై ఆదివాసీల జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఉద్యమాలతో సమాధానం చెప్తామని హెచ్చరించారు.

మాజీ సర్పంచ్ గంగరాజు మృతి

బుట్టాయగూడెం: మండలంలోని పులిరామన్నగూడెం మాజీ సర్పంచ్ కుంజా గంగరాజు(68) శనివారం ఉదయం మృతి చెందారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీకి చెందిన గంగరాజు పులిరామన్నగూడెం పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా 30 ఏళ్లపాటు ప్రజలకు సేవలంది రికార్డు సృష్టించారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్న గంగరాజు మృతి చెందడం పట్ల సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గంగరాజు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాయకులు టి.సుధాకర్, ధర్మల సురేష్, శ్రీనివాస్, బాబూరావు, పోతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సబ్ జైల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి మధుబాబు

చింతలపూడి : స్థానిక సబ్ జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు శనివారం సందర్శించారు. సబ్ జైల్‌లో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలపై జైలు అధికారులను ఆరా తీశారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశాల్లో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవించాక సత్ప్రవర్తనతో మెలగాలని మధుబాబు సూచించారు. ప్రతి ఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని అన్నారు. ఆర్థిక స్తోమత లేని వారికి న్యాయవాదిని లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు. తొలుత వంటశాల, స్టోర్ రూమును తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ టోకూరి వెంకటేష్, ఎల్ చైతన్య, పీఎల్‌వీటీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని అరికడదాం



జంగారెడ్డిగూడెం : ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



పోలవరం : అటవీశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

జంగారెడ్డిగూడెం: వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాల)పై అవగాహన కల్పించారు. వైస్ చైర్మన్ కంచర్ల వాసవిరత్నం, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్స్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నంబూరు రామచంద్రరాజు, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి పాల్గొన్నారు.

● పోలవరం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ట్రెకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సూచించారు. పోలవరంలో అటవీశాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పోలవరం అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్‌కే వలీ, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, సర్పంచ్ పాడుం పుష్ప, కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్న, ఆకుల రాజ, మంగిన వెంకటరమణ, పాదం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యాలను కాపాడవచ్చని సర్పంచ్ తెల్లం రాముడు అన్నారు. మండలంలోని దొరమామిడిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు.

● టి.నరసాపురం: స్థానిక పీహెచ్‌సీ పరిసరాలను వైద్యాధికారి ఫణీంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది శుభ్రం చేశారు. ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించారు. డాక్టర్ ఫణీంద్రబాబు మాట్లాడుతూ ఈ–వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీ సైకిల్ చేయడమే లక్ష్యమన్నారు.

● కామవరపుకోట: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మండలంలో కేఎస్ రామవరం సర్పంచ్ మేడవరపు నమ్రత ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

స్వచ్ఛ దివస్ ర్యాలీ

చింతలపూడి : స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నగర పంచాయతీ కమిషనర్ ఎ.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి గురుభట్లగూడెం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిల్లో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు.

సారా శిబిరాలపై దాడులు

కొయ్యలగూడెం: మంగపతిదేవిపేట సమీపంలోని చింతలపూడి కాల్వ గట్టు వెంబడి శనివారం సోదాలు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. సుమారు 800 లీటర్ల బెల్లం ఊట, 10 లీటర్ల సారాను గుర్తించమని తెలిపారు. తయారి సామగ్రిని ధ్వంసం చేశామన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జంగారెడ్డిగూడెం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు స్థానిక త్రినేత్ర ఆసుపత్రి వద్ద అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి జి. అబ్రహాం ఆధ్వర్యంలో సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు, సిబ్బందికి వివరించారు. అగ్ని నిరోధక యంత్రాలను వినియోగించే తీరు, వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంచారు.

నేడు వరుడు కానున్న శ్రీనివాసుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి 26 వరకు శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. తొలిరోజు ఆదివారం ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తారు. ఈ మేరకు ఏర్పాట్లను శనివారం సాయంత్రం పూర్తి చేశామని ఆలయ ఈఓ సత్యనారాయణ మూర్తి తెలిపారు.

హర్షిత స్కూల్ గుర్తింపు రద్దు

కామవరపుకోట: మండలంలోని తడికలపూడి హర్షిత ఇంగ్లిష్ మీడియం ప్రైమరీ, హై స్కూల్ గుర్తింపు 2025–26 సంవత్సరానికి రద్దు చేసినట్టు ఎంఈఓ డి.సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి, పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బాలరాజు పరామర్శలు



నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

టి.నరసాపురం: బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శనివారం పరామర్శించారు. ఇటీవల శ్రీరామవరంలో గుండెపోటుతో మృతిచెందిన ఎంపీటీసీ సులకాని నరసింహారావు, జంగారెడ్డిగూడెం సమీపంలో రోడ్డు ప్రమాదంలో తిరుమలదేవి పేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తోట లక్ష్మీనారాయణ మృతి చెందారు. వారి ఇళ్లకు బాలరాజు వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. నరసింహారావు, లక్ష్మీనారాయణ కుటుంబాలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాలరాజు వెంట పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, సొసైటీ మాజీ చైర్మన్ కాళ్ళీడి సుబ్బారావు, దాకారపు సూర్యారావు, కాళ్ళీడి జగన్ ఉన్నారు.